క్లుప్తంగా

'పశ్చిమ'లో 2 నామినేషన్ల దాఖలు



స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న శ్రీనివాస్‌రాజు

కంచరపాలెం: విశాఖ పశ్చిమ నియోజకవర్గం –24 జ్ఞానాపురం జోన్–5 జోనల్ కార్యాలయం ఎన్నికల విభాగంలో మంగళవారం వివిధ పార్టీల అభ్యర్థులు రెండు నామినేషన్లు దాఖలు చేసినట్లు రిట్నరింగ్ అధికారి హుస్సేన్ సాహెబ్ తెలిపారు. సమాజ్‌వాది పార్టీ అభ్యర్థి వెలగాడ రవికుమార్ రెండు సెట్లు, స్వతంత్ర అభ్యర్థి మండపాటి శ్రీనివాస్‌రాజు రెండు సెట్లు నామినేషన్‌లు దాఖలు చేశారు. ఇప్పటివరకు పశ్చిమ నియోజకవర్గంలో ఏడుగురు ఎమ్మెల్యే అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేసినట్లు తెలిపారు.

ఘనంగా చైత్ర పౌర్ణమి పూజలు



నృత్య ప్రదర్శనతో అలరించిన చిన్నారులు

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాల రాజు(కృష్ణ)ఆధ్వర్యంలో మంగళవారం చైత్రమాస బహుళ పూర్ణిమ పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. పురవీధుల్లో సుబ్రహ్మణ్య స్వామిని ఊరేగించారు. సాయంత్రం శ్యామల అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి అన్నదానం చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చొక్కాకుల కుమారి, కడగల జ్యోతీష్, కార్యదర్శి కాండ్రేగుల రాము, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



ఈవో శ్రీనివాసమూర్తికి చెక్కు అందజేస్తున్న దాత

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి మంగళవారం నగరంలోని పెదగంట్యాడ ప్రాంతానికి చెందిన వి.రామన్, వి.నరసింహన్ ఆచార్యులు అనే దాతలు రూ. లక్ష విరాళం అందజేశారు. దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివామూర్తి దాతకు బాండ్ ఇచ్చి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో దేవస్థానం ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు పాల్గొన్నారు.

1167వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకుల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి వద్ద కొనసాగుతున్న రిలే దీక్షలు మంగళవారం నాటికి 1167వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన కోక్ ఓవెన్ విభాగ కార్మికులు, ఉక్కు నిర్వాసితులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమల వలన దేశంలో ఆర్థికాభివృద్ధి మెరుగుపడిందన్నారు.

మీ వాడిగా ఆదరించండి.. గెలిపించండి



ఆడారికి హారతులు పడుతున్న మహిళలు

- 58వ వార్డులో ఆడారి ఆనంద్ కుమార్ విజ్ఞప్తి
- హారతులతో స్వాగతం పలికిన మహిళలు



ప్రచార రథంపై నుంచి పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ప్రచారం



భారీగా హాజరైన జనం



గుమ్మడికాయలతో దిష్టి తీస్తున్న మహిళలు

మల్కాపురం : మీలో ఒకడిగా ఉన్నా..మీతోనే ప్రయాణిస్తున్నా..మీ కష్టాల్లో పాల్పంచుకుంటున్నా..ఆపదలో ఉన్నవాళ్లను నా వారిగా ఆదుకుంటున్నా..వచ్చే ఎన్నికల్లో ఒక్క అవకాశం ఇవ్వాలని అభ్యర్థిస్తున్నా...అంటూ వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. జీవీఎంసీ 58వ వార్డు పరిధి పలు ప్రాంతాలలో మంగళవారం ఎన్నికల ప్రచారాన్ని చేపట్టారు. ములగాడ నుంచి ఎదురవానిపాలెం, గొందేశివానిపాలెం, పిలకవానినాలెం, అన్నపూర్ణ నగర్, ఉప్పరకాలనీ, శ్రీహరిపురం వరకు అభిమానులు, కార్యకర్తలు, పార్టీ నాయకులతో కలిసి ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేశారు. అయా ప్రాంతాల్లో ఆడారి ఆనంద్‌కుమార్‌కు మహిళలు, అభిమానులు హారతులు పట్టి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆడారి ఆనంద్ కుమార్ మాట్లాడుతూ శత్రువైన ఆపద అంటే అండగా నిలిచే తత్వం తనదన్నారు. 58వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పలు ప్రాంతాలు పర్యటించినప్పుడు వివిధ సమస్యలను ప్రజలు నా దృష్టికి తీసుకొచ్చారని.. వాటిని రోజుల వ్యవధిలోనే పరిష్కరించానని గుర్తు చేశారు. వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్తగా పగ్గాలు చేపట్టిన 19 నెలల్లోనే ఈ వార్డులో సుమారు రూ.30 కోట్ల మేర అభివృద్ధి పనులు చేపట్టామని వివరించారు. గత ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలిచిన గణబాబు ఇంటికే పరిమితమయ్యాడని విమర్శించారు. నిత్యం ప్రజలతో తాను మమేకమయ్యాయని, రోజూ ఏదో ఒక వార్డులో పర్యటిస్తూ ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరించానని తెలిపారు. పేదల ప్రభుత్వంగా ఉన్న వైఎస్సార్‌సీపీని గెలిపించుకుంటే భవిష్యత్తు బాగుటుందని చెప్పారు. సంక్షేమ పథకాలు కొనసాగాలన్నా.. మరిన్ని సంక్షేమ పథకాలు కావాలన్నా జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో విశాఖ ఎంపీ అభ్యర్థిగా బొత్స ఝాన్సీలక్ష్మిని, పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను ఆశీర్వదించి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో పశ్చిమ ఎన్నికల పరిశీలికురాలు పీలా ఉమారాణి, వార్డు కార్పొరేటర్ గులిగిందల లావణ్య, మండల క్లస్టర్–2 అధ్యక్షుడు అంగరామ్‌ప్రసాద్, వార్డు పార్టీ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్‌రాజు, తోనంగి వెంకటరమణి యాదవ్, చుక్క వరలక్ష్మి, బర్రి సంతోష్, బర్రి సూర్యప్రకాష్, గొందేశి సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కొండవాలు..తిరుగులేని సౌకర్యాలు

- టీడీపీ హయాంలో నిర్లక్ష్యం
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక మహర్దశ
- హర్షం వ్యక్తం చేస్తున్న కొండవాలు ప్రాంత ప్రజలు

నాడు : ఆ వార్డులో అడుగు పెట్టాలంటేనే భయపడే పరిస్థితి. మెట్ల మార్గాలు పూర్తిగా శిథిలావస్థలో ఉండేవి. నడవడానికి వీలుపడేది కాదు. ఎంత జాగ్రత్తగా ఉన్నా అడుపుతప్పి పడిపోయే పరిస్థితి. గత టీడీపీ ప్రభుత్వం కొండవాలు ప్రాంతాల అభివృద్ధిపై ఏనాడూ దృష్టి పెట్టలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

నేడు : కొండవాలు ప్రాంతాల్లో దర్జాగా జీవించే పరిస్థితి ఉంది. మెట్ల మార్గాలు పూర్తిగా మెరుగుపడ్డాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొండవాలు ప్రాంతాలు రూపురేఖలు మారిపోయాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి ప్రభుత్వం అభివృద్ధికి నిధులు కేటాయించింది. దీంతో అక్కడ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



నాడు : హనుమాన్‌సంజీవ్‌కాలనీలో శిథిలావస్థలో మెట్ల మార్గం



నేడు : రూ.20 లక్షలతో నిర్మించిన మెట్లు



నాడు : నక్కవానిపాలెం మెట్ల మార్గం దుస్థితి



రూ.18 లక్షలతో ఆధునికీకరించిన మెట్ల మార్గం

మల్కాపురం : జీవీఎంసీ 59వ వార్డు పరిధిలో కొండప్రాంతాలు ఎక్కువ. రాష్ట్రంలో పలు ప్రాంతాలకు చెందిన వలస కార్మికులు కొండప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకు 15 ఏళ్లుగా జీవనం సాగిస్తున్నారు. తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో నిత్యం ఇబ్బందులు పడ్డారు. వర్షం పడిందంటే చాలు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. కొండచరియలు విరిగిపడి తమ నివాసాలపై ఎక్కడ పడతాయోనని..హనుమాన్ సంజీవ్‌కాలనీ, నక్కవానిపాలెం, హిమచల్‌నగర్, గంగానగర్, గణపతినగర్, వాయుపుత్రకాలనీ, శాంతిగిరికాలనీ కొండ ప్రాంత ప్రజలు చాలా సమస్యలు ఎదుర్కొన్నారు. గత ఏడాది కొండవాలు ప్రాంతాల్లో ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ పశ్చిమ సమన్వయకర్త ఆడారి ఆనంద్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ సమస్యలు ప్రజలు ఆయనకు వివరించారు. వెంటనే స్పందించిన ఆయన జీవీఎంసీ ఉన్నతాధికారులతో మాట్లాడి లక్షలాది రూపాయలతో మెట్లు, కాలువలను ఆధునికీకరించారు. దీంతో ఆయా ప్రాంత వాసులు ఆడారి ఆనంద్‌కుమార్‌కు కతజ్ఞతలు తెలిపారు.

గతంలో అభివృద్ధి శూన్యం



నాడు తమ ప్రాంతాలకు వచ్చిన అధికారులకు గానీ, నాటి టీడీపీ పాలకులకు గానీ కొండప్రాంతాల్లో తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను పట్టించుకోలేదు. ఫిర్యాదు చేసినా పెడచెవిన పెట్టేవారు. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో తమ సమస్యలపై స్పందించి తక్షణం పరిష్కరించే విధంగా చొరవ చూపింది.

– రేవళ్ల సత్యనారాయణ, ఎక్స్‌సర్వీస్‌మెన్‌కాలనీ

చాలా ఆనందంగా ఉంది



నాడు నక్కవానిపాలెంలోని కొండ ప్రాంతంలో మెట్లు మార్గం చాలా అధ్వసంగా ఉండేవి. కనీసం నడిచేందుకు చాలా ఇబ్బంది పడేవాళ్లం. ఒక్కోసారి అదుపుతప్పి గాయపడిన సంఘటనలూ ఉన్నాయి. నేడు తమ ప్రాంతంలో మెట్లు మార్గాలను వైఎస్సార్‌సీపీ నేతలు ఆధ్వర్యంలో ఆధునికీకరించారు. ప్రభుత్వానికి అభినందనలు.

– ఖాన్, నక్కవానిపాలెం, కొండవాలాఉ ప్రాంతం

పూర్తి సౌకర్యాలతో..



నాడు హనుమాన్ సంజీవ్‌కాలనీలో మెట్ల మార్గం అధ్వానంగా ఉండేది. గుంతలు ఉండేవి. రాత్రి సమయంలో అసలు బయటు వచ్చే పరిస్థితి ఉండేది కాదు. మెట్ల మార్గంలో ఎక్కడ పడిపోతామోనన్న భయం వెంటాడేది. ఇప్పుడాపరిస్థితి మారిపోయింది. పూర్తి సౌకర్యాలతో కొండవాలు ప్రాంతాలు ఇప్పుడు అభివృద్ధి చెందాయి.

– వరలక్ష్మి, హనుమాన్‌సంజీవ్‌కాలనీ

వైఎస్సార్‌సీపీ హయాంలోనే నాయీ బ్రాహ్మణులకు గౌరవం



ఆత్మీయ సమావేశంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణుల కుటుంబ సభ్యులు



నాయీ బ్రాహ్మణుల నాయకులు, మహిళలతో ఆడారి ఆనంద్ కుమార్

గోపాలపట్నం: రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణులకు గౌరవాన్ని ఇచ్చింది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అని వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. మర్రిపాలెం వుడా లేఅవుట్ పార్టీ కార్యాలయంలో 92వ వార్డు నాయీ బ్రాహ్మణుల కుటుంబాలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆడారి మాట్లాడుతూ గతంలో చంద్రబాబు నాయుడ్ని కలిస్తే ఆయన ఏవిధంగా అవమాన పరిచారో ఇప్పటికీ నాయీ బ్రాహ్మణులు మర్చిపోలేదన్నారు. జగన్‌మోహన్ రెడ్డి వచ్చిన తరువాత నాయీ బ్రాహ్మణులకు ఎంతో గౌరవం దక్కిందన్నారు.నాయీ బ్రాహ్మణులకు కమ్యూనిటీ హాలు నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో పలు సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. ఇందులో కొన్ని కేంద్ర ప్రభుత్వ సంస్థ పరిధిలోనివన్నారు. ఈ అంశాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లానని, నివేదిక రూపంలో అందించానని తెలిపారు. మళ్లీ జగనే ముఖ్యమంత్రి కాగానే సమస్యలన్నీ పరిష్కారమవు తాయని చెప్పారు. ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని ఆడారి ఆనంద్ విజ్ఞప్తి చేశారు.

సాయమందించే ఆడారినే గెలిపించుకుందాం



ఓటర్‌కు కరపత్రాలు అందిస్తున్న బెహరా భాస్కరరావు

గోపాలపట్నం: పేదలకు కష్టమంటే సాయమందించే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని, పశ్చిమ నియోజకవర్గంలో ముఖ్యమంత్రిని అనుసరించే నాయకుడు ఆడారి ఆనంద్‌కుమార్‌ను మనమంతా గెలిపించుకోవాలని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు, జీవీఎంసీ కో ఆప్షన్ సభ్యుడు బెహరా భాస్కరరావు అన్నారు. 92వ వార్డు ఇందిరా నగర్, వెంకటాపురంలో సోమవారం ఇంటింటా ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవడమే మన లక్ష్యమన్నారు. అలాగే ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ మంచి మెజార్టీతో గెలుపు ఖాయమన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆనంద్ కుమార్‌ను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలను గెలిపించాలని కోరారు. ఆడారి ఆనంద్‌కుమార్ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో రహదారులు, కాలువలు బాగు చేశారని తెలిపారు. సమన్వయకర్తగా వచ్చిన ఏడాదిన్నర కాలంగా నియోజకవర్గంలో ఆయన ప్రజలతో మమేకమయ్యారన్నారు. కార్యక్రమంలో ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివారావు, అప్పలస్వామి నాయుడు, కన్వీనర్లు, గృహసారథులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపుతోనే అభివృద్ధి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న జియ్యాని శ్రీధర్, కృష్ణ

విశాఖ విద్య: పశ్చిమ నియోజకవర్గం 52వ వార్డు శాంతినగర్‌లో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బీఎస్.కృష్ణ (అల్లా కృష్ణ) మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కాలనీల్లో అడుగడుగు నా ప్రజలు వారికి నీరాజనాలు పలికారు. డిప్యూటీ మేయర్ శ్రీధర్, మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ మాట్లాడుతూ ఐదేళ్ల పదవీకాలంలో ఏనాడూ కనిపించని టీడీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్నికల్లో ఓట్లు కోసమని ప్రజలు మధ్య పెట్టేందుకు మళ్లీ ఇంటింటికీ వస్తున్నారని, వారి మాటలు ఏమాత్రం నమ్మి మోసపోవద్దన్నారు. అలాంటి వారికి ఓటు వేసినా, మళ్లీ వారు ఎన్నడూ కనిపించరన్నారు. వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ రాజకీయాల కతీతంగా నియోజకవర్గం వ్యాప్తంగా అనేక సేవా కార్యక్రమాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజలకు ఏ కష్టమొచ్చినా ఆదుకునే నాయకుడు ఆడారి ఆనంద్ కుమార్, అభివృద్ధిలో భాగస్వామ్యమయ్యే బొత్స ఝాన్సీలను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో 52వ వార్డు పార్టీ నాయకుడు జియ్యాని మారుతీ తదితరులు పాల్గొన్నారు.

ఆడారితోనే అభివృద్ధి సాధ్యం



కొత్తపాలెంలో ప్రచారం చేస్తున్న ఆడారి మాలతి

గోపాలపట్నం: వైఎస్సార్‌సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్ గెలుపుతోనే అభివృద్ధి సాధ్యమని ఆయన సతీమణి ఆడారి మాలతి పేర్కొన్నారు. 89వ వార్డు కొత్తపాలెంలో మంగళవారం సాయంత్రం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతీ వీధిలో గడపగడపకు వెళ్లి ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని ఆమె విజ్ఞప్తి చేశారు. మహిళలకు కుంకుమ బొట్లు పెట్టి ఓట్లు అభ్యర్థించారు. నియోజకవర్గం సమన్వయకర్తగా ఉన్న 19 నెలల కాలంలో నియోజకవర్గంలో ఎన్నో అభివృద్ధి పనులు చేశారని తెలిపారు. ఒకసారి అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యేగా మరింత అభివృద్ధి చేసి చూపిస్తారన్నారు. ఆమెతో పాటు ఎన్నికల పరిశీలకురాలు పేడాడ రమణి కుమారి, వార్డు క్లస్టర్ అధ్యక్షుడు అయితంశెట్టి రేణుకా గోపాలకృష్ణ, డీకే ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్, పీఏసీఎస్ చైర్మన్ ఆళ్ల పైడిరాజు, మళ్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎన్‌ఏడీలో అంబేడ్కర్ జయంతి



అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎన్‌ఏడీ సీజీఎం నివారి, కార్మికులు

గోపాలపట్నం: ఎన్‌ఏడీ మేనేజ్‌మెంట్, ఎన్‌ఏడీ వర్క్స్ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 133వ జయంతి ఉత్సవాలు ఎన్‌ఏడీ కాలనీ ఆడిటోరియంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి నేవల్ ఆర్మమెంట్ డిపో చీఫ్ జనరల్ మేనేజర్ సీజే నివారి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ జయంతి సందర్భంగా కర్తదాన శిబిరం ఏర్పాటు చేయడం గొప్పవిషయమన్నారు. ఆపదలో ఉన్నవారికి రక్తం అందివ్వడమంటే ప్రాణ దానం చేయడమేనన్నారు. రక్తదానం చేసిన కార్మికులందరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఏటా అంబేడ్కర్ జయంతి పురస్కరించుకుని రక్తాదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామని ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి మారయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో ఈస్టర్న్ నావెల్ కమాండ్ కార్మికులు పాల్గొన్నారు.

గ్రీన్ బెల్టులో సౌకర్యాలు



జిందాల్ భవన్ వద్ద ఆకట్టుకుంటున్న యోగాసనాల బొమ్మలు

గోపాలపట్నం: గ్రీన్ బెల్టులు కేవలం కాలుష్యాన్ని తగ్గించేందుకు గతంలో ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా మొక్కల్ని పెంచారు. ఇవి రానురాను జంగిల్‌లా తయారయ్యాయి. వీటిని ప్రజలకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దేందుకు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ శ్రీకారం చుట్టారు. దీంతో ఇక్కడి మర్రిపాలెం వుడాలేవుట్‌లో గ్రీన్ బెల్టులో వాకింగ్ ట్రాక్ నిర్మాణం ప్రయోగాత్మకంగా చేపట్టారు. ఆ తరువాత మోడల్ లైటింగ్, ఓపెన్ జిమ్, పిల్లలఆట వస్తువులు ఏర్పాటు చేశారు. మర్రిపాలెం వుడాలేఅవుట్‌తో పాటు, జిందాల్ భవన్ వద్ద, ఆర్‌అండ్‌బీ బిల్డింగ్ వద్ద గ్రీన్ బెల్ట్ వద్ద వాకింగ్ ట్రాక్‌లు నిర్మించారు. జిందాల్ భవన్ వద్ద యోగాసనాల చిత్రాలు అలరిస్తున్నాయి. పార్కులు అభివృద్ధిపై దృష్టి సారించిన డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌ను పలువురు అభినందిస్తున్నారు.

మళ్లీ సీఎం జగనన్నే..



వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరిస్తున్న పిల్లా రమాకుమారి

సింథియా : విద్య,వైద్యం, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చని ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతోందని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి అన్నారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ జగన్ సీఎం కావాలని బలంగా కోరుకుంటున్నారని ఆమె పేర్కొన్నారు. మంగళవారం జీవీఎంసీ 62వ వార్డు పరిధి అచ్చెంనాయుడులోవ, జనతాకాలనీలోని 124 పోలింగ్‌బూత్ పరిధిలో వార్డు కార్పొరేటర్, జీవీఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యులు బల్ల లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమాకుమారి మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక వార్డు, గ్రామ సచివాలయాలు, జిల్లాల పునర్విభజన ద్వారా పరిపాలనను వికేంద్రీకరణ జరిపి ప్రజల ముంగిటకే పాలన తీసుకొచ్చారన్నారు. వచ్చే ఎన్నికల్లో తన సోదరుడు ఆడారి ఆనంద్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీలో పని చేస్తున్న ప్రతిఒక్కరికీ సముచిత స్థానం కల్పించే బాధ్యత ఆనంద్‌కుమార్ తీసుకుంటాడని చెప్పారు. ఎమ్మెల్యేగా ఆడారి ఆనంద్‌కుమార్‌ను, విశాఖ ఎంపీగా బొత్స ఝాన్సీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్లు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.